క్లుప్తంగా

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సాయం



గన్నవరం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం 2024- 25లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు మానవత సంస్థ ద్వారా రూ.6 వేలు ఆర్థిక సాయం చేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వీవీ కృష్ణమోహన్, సభ్యులు ముక్కామల సుబ్బారావు, గన్నె వెంకట్రావు, ఎస్. సత్యనారాయణ, వీ వెంకటేశ్వరరావు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబు, నియోజకవర్గ అధ్యక్షుడు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలంలో అప్రమత్తత అవసరం



ఉయ్యూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ప్రముఖ ఆర్థో సర్జన్ డాక్టర్ జాన్ డేవిడ్ అన్నారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో హోప్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థో సర్జన్ డాక్టర్ జాన్ డేవిడ్, ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ మీనాకుమారి, ఎండీ గైనకాలజిస్ట్ డాక్టర్ సమీరా వైద్య సేవలు అందించారు. 210 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ జాన్ డేవిడ్ ప్రజలు తెలుసు కోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.

మకర తోరణం సమర్పణ



పెనమలూరు: కానూరు కామయ్యతోపులో వేంచేసి ఉన్న శ్రీగంగానమ్మతల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎం.అనిల్ కుటుంబ సభ్యులు శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి మకర తోరణం సమర్పించారు. భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా ప్రచార హోర్డింగ్‌లు



కేసరపల్లి(గన్నవరం): స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రామవరప్పాడు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా ఉన్న ప్రచార హోర్డింగ్‌లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలకు హోర్డింగ్‌లపై ఉన్న బ్యానర్లు ముక్కలు ముక్కలుగా చిరిగిపోతున్నాయి. చిరిగిన బ్యానర్ ముక్కలు జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాలపై పడుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు విద్యుత్ సరఫరా లైన్లపై పడి షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నిత్యం వీవీఐపీలు, వీఐపీలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బ్యానర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- తెంపల్లె రోడ్డు మలుపుల మయం
- ప్రమాదాలకు నిలయంగా రోడ్డు
- ఈ మార్గంలో ఐదు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు
- మలుపుల వద్ద ప్రమాదాల నివారణ చర్యలు శూన్యం
- పట్టించుకోని ఆర్ అండ్‌బీ అధికారులు



పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద మలుపు



టవల్స్ కంపెనీ వద్ద ప్రమాదకర మలుపు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లె రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉంది. పెద అవుటపల్లి వద్ద జాతీయ రహదారి నుంచి తెంపల్లె వరకు ఆర్ అండ్‌బీ రహదారి అనేక మలుపులతో ఉంది. ఈ రోడ్డు మార్గంలో తెంపల్లె, బల్లిపర్రు, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, సగ్గూరు గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు విద్యార్థులు, చిన అవుటపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పరిశ్రమలలో పని చేసే వందలాది మంది కార్మికులు, వీరపనేనిగూడెం ఏపీఐఐసీలో ఉన్న పరిశ్రమల్లో పని చేసే వందలాది మంది కార్మికులు నిరంతరం ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతేగాక వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది.

హెచ్చరిక బోర్డులేవీ..

ఇంతటి ట్రాఫిక్ ఉన్న రోడ్డు మార్గంలో కనీసం పది చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా ఆర్అండ్‌బీ శాఖకు చీమకుట్టినట్లు లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన లేదు. ఎన్నో మార్లు ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు వినతులు అందజేశారు. అయినా చర్యలు శూన్యం.

అడుగడుగునా గండమే

పెద అవుటపల్లి జాతీయ రహదారి దాటి ముందుకు రాగానే చెత్త నిల్వలకు నిప్పు పెట్టి ఉంచడంతో పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేస్తోంది. పొగలో నుంచి బయట పడి రైల్వే లెవెల్ క్రాసింగ్ మలుపునకు చేరుకునే క్రమంలో ఉన్న మలుపు ప్రమాదాలకు దారితీస్తోంది. క్రాసింగ్ దాటిన తరువాత హేచరి వైపునకు తిరిగే మలుపు మరింత ప్రమాదకరంగా ఉంది. అది దాటి ముందుకు వెళ్లిన తరువాత టవల్స్ కంపెనీ వద్ద మరో మలుపు ప్రమాదాలకు ఆస్కారం కలిగిస్తోంది. అదే ప్రదేశంలో మూడు మలుపులు ఉండటంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని ప్రయాణికులు అంటున్నారు. ఇటువంటి మలుపులు మరో పది వరకూ ఉన్నాయి. ఈ రోడ్డు వెంట జంగిల్ పెరిగితే ఆ ప్రమాదాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది.



లెవెల్ క్రాసింగ్ దాటిన తరువాత హేచరీ వైపు ఉన్న మలుపు

ఆరు నెలల్లో 20 పైగా ప్రమాదాలు..

ఈ మలుపుల వద్ద గత ఆరు నెలల్లో 20 పైగా ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదాల్లో ఆటోలు, ద్విచక్రవాహనాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదాల నుంచి కాపాడాలి



తెంపల్లె రోడ్డు మార్గంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు నివారించాలి. తరచూ ఈ మలుపుల వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొంటు న్నాయి. ప్రయాణికులు పడిపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి కాపాడాలి.

– పి.వెంకట రమణ, తెంపల్లె

ఇబ్బందులు తొలగించండి



రోజూ జరిగే ప్రమాదాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. చాలా కుటుంబాలు నష్టపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు నివారించాలి. మలుపుల వద్ద ఇబ్బందులు తొలగించాలి.

– మస్తాన్ ఖాన్, తెంపల్లె

చెరువుల్లో చేపల సాగు హక్కులకు వేలం నిర్వహించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చేపల చెరువులకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బూరుగుల చెరువు, జంగమవాని చెరువుల్లో చేపల సాగు హక్కులకు గడువు జూన్ నెలాఖరుతో ముగిసినందున గ్రామ పంచాయతీ ఈ ఏడాది చేపల చెరువులకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత రెండు దఫాలుగా చేపల చెరువుల వేలం డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయో గ్రామ ప్రజలకు తెలియజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల మృతి

కంకిపాడు: ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర (53) శనివారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. కొద్ది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి గాయపడ్డ రవీంద్ర ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటివద్దే వైద్యం పొందుతున్నారు. శనివారం రాత్రి ఆరోగ్యం విషమించి గుండెపోటు రావటంతో మృతి చెందారు. ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామమైన జగన్నాథపురం తరలించారు. దావులూరు టోల్‌గేట్ వద్ద నుంచి చేపట్టిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), వెలగపూడి శంకర్‌బాబు తదితరులు రవీంద్ర భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. స్వగ్రామమైన జగన్నాథపురంలో రవీంద్ర భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

కంకిపాడు: డ్రెయిన్లలో వ్యర్థాలను ఎట్టకేలకు అధికారులు తొలగింపచేశారు. 'డ్రెయిన్లలో పేరుకుపోతున్న వ్యర్థాలు' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి శుభ్రపరిచారు. దీంతో మురుగు పారుదలకు ఆటంకాలు తొలగిపోవటంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాలకు నిలయంగా బందరు కాలువ



పెనమలూరు: సాగుకాలువ అయిన బందరు కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. తూర్పు కృష్ణాకు సాగునీరు అందిస్తున్న బందరు కాలువ పరిస్థితి నానాటికి అధ్వానంగా మారుతోంది. పంటల సాగుకు ఎంతో ప్రాధాన్యత కలిగిన బందరు కాలువను పరిరక్షించటంతో ప్రభుత్వం విఫలమవుతోంది. నేడు బందరు కాలువలో గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండిపోయి దారుణంగా ఉంది. ఖరీఫ్ సీజ్ మొదలయినా నేటికీ ప్రభుత్వం బందరు కాలువను పూడిక తీయలేదు. యనమలకుదురు లాకులు, తాడిగడప వంతెన, పెనమలూరు, గోసాల వంతెనల వద్ద బందరు కాలువలో వ్యర్థాలు కాలువలో పెద్ద ఎత్తున వచ్చి పూడుకు పోయింది. కాలువలో తీవ్రదుర్గంధం వస్తోంది. రైతన్నలకు జీవనాడిగా ఉన్న బందర కాలువను ప్రభుత్వం పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

• భక్తిశ్రద్ధలతో జలాభిషేకం





ఏటా శ్రావణమాసంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా నగరంలోని జైనులు ఆదివారం కృష్ణానది జలాలు తీసుకెళ్లి గురునానక్ కాలనీలోని శివాలయంలో శివుడికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో జైన మహిళలు, యువతులు దుర్గా ఘాట్‌కు చేరుకుని కావడుల్లో నదీ జలాలు పట్టుకొని ప్రదర్శనగా శివాలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం మొదటి వారంలో ఇలా నిర్వహిస్తామని జైనులు తెలిపారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వాకర్స్ అసోసియేషన్ సేవలు ఆదర్శనీయం

గన్నవరం: వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు జిల్లాకే ఆదర్శనీయమని అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ నేతృత్వంలో క్రీడా ప్రాంగణాన్ని, వాకింగ్ ట్రాక్‌ను సుమారు రూ.25 లక్షలు ఖర్చుపెట్టి అభివృద్ధి చేయడం అభినందనీ యమన్నారు. అసోసియేషన్ సభ్యులందరి సమష్టి కృషి ఫలితంగానే ఇంతటి ప్రగతి సాధించారని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎంజీఎఫ్ మెంబర్‌షిప్ సంఖ్యను పెంచాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ వాకింగ్ ట్రాక్ చుట్టూ ఎల్ఈడీ లైటింగ్, మొక్కలు, వాలీబాల్ కోర్టు, టాయిలెట్స్, బోర్‌వెల్ వంటి సదుపాయలను కల్పించారని చెప్పారు. అనంతరం కేవీఆర్.కిషోర్, ముక్కామల సుబ్బారావు రూ.30 వేల చొప్పున చెల్లించి సిల్వర్ డోనర్‌గాను, చిల్లపల్లి శ్రీనివాసరావు రూ.10 వేలు చెల్లించి ఎంజీఎఫ్ మెంబర్‌గా చేరారు. వాకర్స్ ఎం.సుబ్బారావు, చిమట రామారావు, బాబూరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో సమావేశమైన డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి వినియోగదారుడు తూనికలు, కొలతలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఏలూరు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని పలు చికెన్, మటన్, చేపల దుకాణాలతో పాటుగా కిరణ షాపులను ఆయన తనిఖీ చేశారు. నాన్ వెజ్ మార్కెట్‌లో ఆదివారం అమ్మకాలు అధికంగా జరుతుండటంతో తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. అక్కడి వినియోగదారులకు పలు సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్ కాటాల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తూనికలు, కొలతల శాఖ ద్వారా లైసెన్స్, సీల్ లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలకు వినియోగిస్తున్న ఇద్దరు వ్యాపారులకు అదనపు రుసుము చెల్లించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. తూకంలో అవకతకలు ఉన్నట్లుగా గుర్తించిన మరో ఇద్దరు వ్యాపారులకు రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా తూకం సరి చేసుకోవాలని చెప్పారు. చికెన్, మటన్ దుకాణాల్లో బరువుతో పాటుగా రేట్‌ను సూచించే ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించాలని ఆదేశించారు.

మనిషి చేయగలిగే గొప్ప సేవల్లో రక్తదానం ఒకటి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి చేయగలిగే గొప్ప సేవలలో రక్తదానం ఒకటి అని మౌలానా మిర్జా జహీర్ అబ్బాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండు సార్లు కనీసం రక్తదానం చేయాలని ఆయన సూచించారు. నగరంలోని మసీదు- ఇ-హుస్సేన్‌లో ఆ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముస్లిం సంక్షేమ సమితి అధ్యక్షుడు ముఖ్తార్ అలీ ,మౌలానా మీర్ జావీద్ అలీ బాఖరీలతో కలిసి మౌలానా మిర్జా జహీర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎందరో ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని తెలిపారు. మానవసేవయే మాధవ సేవ అని, కేవలం మనిషి తన కోసం కాకుండా పొరుగు వారికి ఏదో రకంగా సేవా చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం మొహర్రం సంతాపదినాల్లో తమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని ఈ ఏడాది కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మౌలానా మిర్జా జహీర్ అబ్బాస్, ముఖ్తార్ అలీ

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన శక్తి బృందాలు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కలిగిస్తున్నారు. మహిళలు, యువతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు శక్తి బృందాలు వెళ్లి మహిళా చట్టాలు, శక్తియాప్, అత్యవసర సేవల నం.112, సైబర్ మోసాల నివేదికల కోం 1930, బాలల హెల్ప్‌లైన్ 1098, మహిళల హెల్ప్‌లైన్ 181, ట్రాఫిక్ సమాచారం కోసం 1073, ఫైర్ ఎమర్జెన్సీ 101 వంటి కీలకమైన టోల్‌ఫ్రీ నంబర్లపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ కెజివి సరిత, మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ టి దైవప్రసాద్‌ల పర్యవేక్షణలో శక్తి బృందాలు వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తూ అవగాహన కలిగిస్తున్నారు. అంతేకాకుండా మహిళలు, యువతుల మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హెచ్ శ్రీనివాస్‌లు, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయ సత్యబాబులు పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీలు రెట్టింపు అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయం దాచి పెట్టి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన ఇళ్లకు అధికంగా బిల్లులు వస్తున్నాయనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు బిగించిన మీటర్లను సైతం తొలగించాలని కోరారు. సమావేశంలో మహిళా సంఘాల నాయకులు జి. ఆదిలక్ష్మీ, పి. దుర్గాంబ, ఇతర అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ



పెనమలూరు: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ నజీర్ ఆదివారం ఆవిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో తాడిగడప జంక్షన్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు ఆవిష్కరించలేదు. కాగా ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కమిషనర్ నజీర్ మాట్లాడుతూ దేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బోడె వెంకట్రామ్, షేక్ బుజ్జి, పలువురు నాయకులు పాల్గొన్నారు.